# ధనియాలు

ధనియాలు (కోరియడ్రమ్ సటైవమ్) అనునది వార్షిక సుగంధ ద్రవ్యాల పంట. వీటని కొత్తిమీరగా (ఆకుపచ్చని కురగాయాలు) మరియు ధనియాలుగా (సుగంధ ద్రవ్యాలుగా) పండించబడుతున్నాయి.ప్రాచీన గ్రీకులు బరువు తగ్గించుటకు కొత్తిమీరను ఉపయోగించేవారు. ఆయుర్వేద వైద్యంలో కొత్తిమీర, ఆహారం జీర్ణం కావుటకు ఉపయోగించేవారు. చైనీస్ వైద్యంలో వికారం, హెర్నియా, విరేచనాలు, అతిసారము తగ్గించుటకు విరివిగా వాడెవారు. ధనియాలు మధ్యదరా సముద్ర దేశాలలో పుట్టినట్లుగా ఆధారాలున్నాయి

**ఉత్పత్తి వివరాలు:** భారతదేశంలో ధనియాలుగా 516070 హెక్టార్లలలో సాగవుతూ 496250 టన్నుల ఉత్పత్తి అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువగా కొత్తిమీరగా పండించబడుతుంది.

**వాతవారణం:** కొత్తిమీర ఉష్ణమండల పంట ఆకు పంటకొరకు (కొత్తిమీర) సంవత్సరం అంతట పండించుటకు అనుకూలం. విత్తనాల కొరకు రబి కాలం అనుకూలం. ధనియాలకు పుష్పించే మరియు లేత గింజదశలో ఎండు నుండి చల్లని వాతావారణం చాలా అవసరం. పూత మరియు గింజ దశలో మేఘాలు ఆవరించి ఉన్నట్లయితే చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉంది.

**నేలలు:** కొత్తిమీరగా దాదాపు అన్ని నేలలు అనుకూలం. వర్షధారం క్రింద అయితే నల్లరెగడి నేలలు, నీటివసతి క్రింద అయితే ఎర్రనేలలు, గరపనేలలు, ఇసుకనేలలు అనుకూలం. చౌడు భూములు ఈ పంటకు అనుకూలం కాదు.

**రకాలు:**

| క్ర.సం. | రకము | దిగుబడి కి/హె | నూనే శాతము | పంటకాలం | గుణగణాలు |
|---|---|---|---|---|---|
| 1 | గుజరాత్ ధనియా-1 | 1100 | 0.35 | 112 | ముందస్తుగా నాటుటకు అనుకూలం. నిటారుగా పెరుగు మొక్క, గుండ్రటి విత్తనాలు కలిగిఉంటాయి. బూడిద, వడలు తెగులు తట్టుకుంటాయి. |
| 2 | కో-1 | 440 | 0.25 | 110 | పోట్టిజాతి మొక్క, వర్షదారంగా, కొత్తిమీరగా, ధనియాగా పండించవచ్చు. చిన్న పరిమాణంగల విత్తనాలు |
| 3 | కో-2 | 520 | 0.40 | 100 | కొత్తిమీర, ధనియాలుగా పండించవచ్చును. చౌడునేలలకు, వర్షభావ ప్రాంతాలకు అనుకూలం విత్తనం విరుపుగా ఉంటుంది. |
| 4 | కో-3 | 650 | 0.41 | 95 | కొత్తిమీరగా,ధనియాలుగా పండించ వచ్చును. మధ్యస్త పరిమాణం గల విత్తనాలు, నీటి వసతి మరియు వర్షధారగా రబీ మరియు ఖరీఫ్ కాలంకు అనుకూలం. బూడిద మరియు వడలుతెగులును తట్టుకుంటుంది. |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 5 | కో-4 | 600 | 0.4 | 75 | ముందుగా కొతకు వస్తుంది. నీటివసతి మరియు వర్షధార ప్రాంతాలకు అనుకూలం. గింజలు విరుపుగా ఉంటాయి వడలు తట్టుకుంటాయి. |
| 6 | గుజరాత్ ధనియా-2 | 1450 | 0.4 | 70 | మధ్యస్త వ్యాప్తిగల మొక్క, ముందస్తుగా నాటుటకు అనుకూలం. బూడిద తెగులు తట్టుకుంటుంది. గింజలు విడిపోకుండా ఉంటుంది. |
| 7 | రాజేంద్ర స్వాతి | 1300 | 0.65 | 80 | ముందస్తు వ్యాప్తిగల మొక్క, సువాసనగల గుండ్రటి విత్తనాలు, అంతర పంటలకు అనుకూలం. రసం పిల్చు పురుగుల తాకిడిని తట్టుకుంటుంది. |
| 8 | సాధనా | 1025 | 0.20 | 110 | కొత్తిమీరగా, ధనియాలుగా, మధ్యస్తు నీటారుగల మొక్క. వర్షధారపు పంట, నీటి ఎద్దడిని, రసంపీల్చు పురుగులను తట్టుకుంటుంది. |
| 9 | స్వాతి | 855 | 0.30 | 85 | మధ్యస్తు నిటారు మొక్క, తక్కువ పంటకాలం వర్షదారపు, రసం పీల్చు పురుగులను తట్టుకుంటాయి. |
| 10 | సియస్287 | 600 | 0.4 | 100 | తక్కువ పంటకాలము, వర్షధారంగా, నీటివసతి కింద, వడలు తెగులు తట్టుకుంటుంది. |
| 11 | సింధు | 1000 | 0.40 | 100 | అండాకారపు విత్తనాలు, వర్షధారగా, వడలు, బూడిద తెగులును తట్టుకుంటాయి. |
| 12 | హిస్సార్ ఆనంద్ | 1400 | 0.35 | 100 | కొత్తిమీరగా, ధనియాలుగా, అన్ని భూములకు అనుకూలం. మొక్కలు వంగిపోకుండా ఉంటాయి |
| 13 | హిస్సార్ సుగంధ్ | 1400 | 0.4 | 110 | నీటివసతి క్రింద అనుకూలం కాండం తెగులు తట్టుకుంటుంది. |
| 14 | హిస్సార్ సురభి | 1800 | 0.5 | 130 | నీటారుగల పొద మొక్క, విరుపుగా ఉంటాయి మంచును మరియు రసం పీల్చు పురుగును తట్టు కుంటాయి. |
| 15 | ఆజాద్ ధనియా-1 | 1000 | 0.29 | 125 | నీటారుగా, క్రింది కొమ్మలతో గొడుగు ఆకారంలో ఉంటుంది. నీటి ఎద్దడి, బూడిద తెగులురసం పీల్చు పురుగులని తట్టుకుంటాయి. |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 16 | పంత్ హరితిమా | 1200 | 0.4 | 160 | ఎత్తుగా నిటారుగా పెరుగు మొక్క కొత్తిమీరగా, ధనియాలుగా, చిన్న పరిమాణం విత్తనాలు, కాండం తెగులును నిరోదిస్తుంది. |
| 17 | ద్వా-3 | 400 | 0.27 | 180 | కొత్తిమీరగా, ధనియాలుగా, రబి పంటకు, నల్లరేగడికి అనుకూలం. బూడిద తెగులును తట్టుకుంటుంది. |
| 18 | సింపోస్-33 | 2100 | 1.3 | 140 | ఎత్తుగా నిటారుగా పెరుగు మొక్క, గుబురుగా, ఎక్కువ కొమ్మలతో, చిన్న విత్తనాలుగల మొక్క.నూనే కొరకు అనుకూలం |
| 19 | ఎపిహెచ్‌యూ ధనియా-1 | 650 | 0.4 | 90 | గింజలు ఆకర్షణీయంగా మంచి సువాసనగల రకము |
| 20 | ఆర్‌సిఆర్-446 | 1200 | 0.33 | 100 | ఎత్తైన మొక్క కొత్తిమీరగా, ధనియాలుగా ఎక్కువ విత్తనాలు గల రకం. |

**కొత్తిమీర కొరకు:**

ధనియాలను ఆకుకోసం సంవత్సరం పాటు సాగు చేసుకోవచ్చును. అయితే వేసవిలో కొత్తిమీర కొరకు చెట్టు నీడలో కాని, తాటాకు పందిరి కిందకాని, షేడ్‌నెట్ క్రిందకాని నీటి వసతికల ప్రాంతంలో సాగు చేసుకోవచ్చును.

**నేల తయారి, విత్తటం:**

మెత్తటి పదును వచ్చే వరకు 3-4 సార్లు దుక్కిదున్నాలి. అక్టోబరు 15 నుండి నవంబరు 15 లోపు నేలలోని తేమను బట్టి విత్తుకోవాలి. సాలుకు సాలుకు 30 సెం.మీ., మొక్కకు, మొక్కకు 10 సెం.మీ. ఎడం వుండేటట్లు గొర్రుతో విత్తుకోవాలి. విత్తనాలను బద్దలుచేసి విత్తితే విత్తనం ఆదా అవటమే కాకుండా, మొలక కూడా 2-3 రోజులు ముందుగా వస్తుంది. విత్తే ముందు 5-6 గంటల సేపు నానబెట్టి, ఆరనిచ్చి విత్తినట్లయితే విత్తనం త్వరగా మొలుస్తుంది. ఎకరానికి 6 కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తే ముందు అజోస్పైరిల్లం (బయోఫర్టిలైజర్) ఎకరానికి 600 గ్రా॥ చొప్పున మోతాదు విత్తనానికి కలిపి శుద్ది చేసినట్లయితే, దిగుబడి పది నుంచి పదిహేను శాతం వరకు పెరుగుతుంది. ఇదే మోతాదుతో సుడోమోనాస్‌తో కూడా విత్తనశుద్ధి చేసుకోవచ్చు. ఎండు తెగులు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో ధనియాల సాగు చేయరాదు. తప్పనిసరిగా చేయవలసి వస్తే, 2-3 సంవత్సరాలు పంట మార్పిడి చేసి ఉండాలి. వేసవిలో లోతు దుక్కి దున్నుకోవడం వలన తెగులును కలుగజేసే శిలీంధ్రాన్ని నేలలో అదుపు చేయవచ్చు. అలాగే ఒక గ్రా.కార్బెండిజిమ్‌తో ఒక కిలో విత్తనాన్ని విత్తనశుద్ధి చేయడం ద్వారా కూడా తెగులు రాకుండా కాపాడవచ్చు. బయోఫర్టిలైజర్ మరియు శిలీంధ్ర నాశునులతో విత్తనశుద్ధి చేయవలసినపుడు శిలీంద్రనాశనితో రెండు మూడు రోజుల ముందు విత్తనశుద్ధి చేయాలి. బయోఫర్టిలైజర్‌తో మాత్రం విత్తేముందే విత్తన శుద్ధి చేయాలి.

**ఎరువులు, అంతరకృషి:**

వర్షాధారం కింద నల్లరేగడి నేలల్లో ఆఖరిదుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుతోబాటు 40 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 27 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. నీటిపారుదల కింద తేలికపాటి నేలల్లో పైన తెల్పిన మోతాదుతోబాటు విత్తిన 30 రోజులకు 12 కిలోల యూరియా, 8 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను పైపాటుగా వేసుకోవాలి. విత్తిన వెంటనే పెండిమిథాలిన్ బరువైన నేలల్లో అయితే ఎకరానికి 1.3 లీ., తేలిక నేలల్లో అయితే 1 లీ. 200లీ. నీళ్ళలో కలిపి పిచికారీ చేసుకొని, మొదటి నెల వరకు కలుపు నివారణ చేసుకోవచ్చు. విత్తనం మొలకెత్తటం పూర్తి అయిన తర్వాత ఒకసారి, 35-40 రోజులకు రెండవసారి గొర్రుతో అంతర కృషిచేయాలి.

**అంతర పంటలు:**

ధనియాలతో బాటు ఆవాలు, కుసుమలు, శనగలు మిశ్రమపంటలుగా వేసుకొనవచ్చు నీటి వసతి ఉన్నచోట విత్తిన 45 రోజులకు ఒకసారి, 60 రోజులకు ఒకసారి స్ప్రింక్లర్ లేదా రెయిన్‌గన్ ద్వారా నీరందించుట ద్వారా 25-30శాతం అధిక దిగుబడి పొందవచ్చు.

**సస్యరక్షణ**

**పురుగులు**

**పేనుబంక:** ఆకులు, పూత నుండి రసాన్ని పీల్చి గింజలు ఏర్పడకుండ చేస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో మిథైల్ డెమిటాన్ 2.0 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

**ఎర్రనల్లి:** ఆకులు అడుగున గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా ఆసిఫేట్ 1 గ్రా॥ కలిపి పిచికారీ చేసుకోవాలి.

**తామర పురుగులు:**

ఆకులను, పూతను గీకి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి ఫిప్రొనిల్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

**తెగుళ్ళు:**

**బూడిద తెగులు:**

ఆకుల అడుగున చిన్న చిన్న బూడిద రంగు మచ్చలేర్పడి పై భాగానికి, కాండానికి వ్యాపిస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రాము కార్బండైజిమ్ లేక 1 గ్రా॥ క్యాల్జిన్ కలిపి పిచికారీ చేయాలి.

**ఎండు తెగులు:**

ఇది 'ప్యుజేరియమ్ ఆక్సీస్పోరమ్' అనే శిలీంధ్రం వలన ఆశిస్తుంది. నివారణకు పైన తెలిపిన విధంగా విత్తనశుద్ధితో పాటు పంట మార్పిడి చేయాలి. తెగులు లక్షణాలు కనిపించగానే లీటర్ నీటికి 1 గ్రా॥ కార్బండైజిమ్‌ను లీటర్ నీటిలో కలిపి వేరువద్ద పోసుకోవాలి.

**గింజ నలుపు తిరుగుట:**

ఇది సమస్యగా ఉన్నప్పుడు మాంకోజెబ్ 3 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పూత నుంచి గింజ పట్టే దశలలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**కోతలు మరియు అనంతర సాంకేతిక పరిజ్ఞానం:**

రకాన్ని బట్టి 40-45 రోజులకు పూత మొదలై 80-110 రోజులకు పక్వానికొస్తాయి. మొక్కలపై 60 శాతం గింజలు పక్వానికొచ్చినప్పుడు పంటకోసుకోవాలి. పంట ఉదయంపూట మాత్రమే కోయాలి. పంట కోసిన తర్వాత 2-3 రోజులు పొలంలోనే ఆరనిచ్చి నూర్చుకోవాలి.

**విత్తనం నిల్వచేయటం :**

నిల్వ ఉంచిన సంచులపై మలాథియాన్ చల్లటం, విత్తనాన్ని అప్పుడప్పుడు ఎండ బెట్టటం ద్వారా గింజను నిల్వలో ఆశించే పురుగుల నుండి రక్షించుకోవచ్చు.

**ముఖ్యాంశాలు:**

- నిర్దేశించిన మోతాదుకు మించి విత్తనాన్ని వాడరాదు.
- సాధన, సింధు రకాలను త్వరగా బెట్టకు వచ్చే నేలల్లో వర్షాధారంగా సాగుచేయరాదు.
- పైరు పూర్తి పూత మీద వున్నప్పుడు గంధకం (ఎర్రనల్లి, బూడిద తెగులు నివారణకు) పొడి చల్లరాదు.
- పంట మార్పిడి అవలంభించాలి.
- గొర్రు, గుంటకలతో రెండు సార్లు అంతరకృషి చేసనట్లయితే పంట బెట్టను తట్టుకుంటుంది.
- పూతకు, ముందు, గింజ ఎదిగే సమయంలో ప్లానోఫిక్స్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకొని అధిక దిగుబడి పొందవచ్చు

ధనియాలు సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, పసుపు పరిశోధనా స్థానం,**
కమ్మరపల్లి - 503 308, నిజామాబాద్ జిల్లా. ఫోన్: 08724-277283